## క్లుప్తంగా

### మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



పొంగులేటికి మొక్క అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మాణిక్యారం, మస్సివాగు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు. మాణిక్యారం కేంద్రంగా ఏడాది క్రితం వందలాది కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని గుర్తుచేస్తూ మొక్కను అందజేశారు. జిల్లాలో అతిపెద్ద మండలాల్లో ఇల్లెందు ఒకటిగా ఉందని, ఈ కారణంగా డబుల్‌బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో ఇల్లెందు మండలానికి కేటాయింపు సంఖ్య పెంచి ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. బానోత్ రాంబాబు, చెన్నూరి శ్రీను, కిన్నెర నర్సయ్య, పుప్పాల ఉపేందర్, బిచ్చల వెంకటాద్రి, కృష్ణ పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయాలని, రైతులకు షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు, వరికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. జిల్లాలో అర్హులకు తెల్ల రేషన్ కార్డులు, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోముల రమేష్, నాగేంద్రబాబు, పోనిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొత్తగూడెంటౌన్: సాధారణ ప్రజా జీవితానికి భంగం కలిగించి గొడవలు పడే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. గురువారం కొత్తగూడెం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు డీఎస్పీ హాజరై మాట్లాడారు.

### ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

టేకులపల్లి: టేకులపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాసాచారి అధ్యక్షతన ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించాక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎండీవై.పాషా, ప్రధాన కార్యదర్శిగా బానోత్ దస్రు, కోశాధికారిగా గంగారపు శేషయ్య, సహాయ కార్యదర్శులుగా సుగ్గల గోపి, రాయల ప్రశాంత్, ప్రెస్‌క్లబ్ ఇన్‌చార్జ్‌గా తాడోజు సందీప్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా ధర్మపురి శ్రీనివాసాచారి, ముఖ్య సలహాదారుగా అర్వ పాపారావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సభ్యులు తోటకూరి శ్రావణ్‌కుమార్, పలుకూరి రాధాకృష్ణ, బోడ సూర్య, గుడిపూడి నరేష్, కడుదుల రాము, మాలోతు వినోద్, గుగులోత్ కృష్ణ, చిర్రా సర్వేష్ పాల్గొన్నారు.

### మేకపిల్లలపై కుక్కల దాడి

జూలూరుపాడు: అన్నారుపాడు గ్రామంలో కుక్కల దాడిలో మేకపిల్ల మృతి చెందింది. బాధితురాలు భూక్యా కమ్లీ తెలిపిన వివరాలు.. గురువారం మేక, మూడు పిల్లలను మేతకు తీసుకెళ్తుండగా కుక్కల గుంపు దాడి చేయడంతో ఒక పిల్ల చనిపోగా, రెండు పిల్లలకు తీవ్రగాయాలైనట్లు తెలిపింది. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

### అండగా ఉంటాం..

పాల్వంచరూరల్: ఇటీవల పాల్వంచలో హత్యకు గురైన అల్లూరి విష్ణు కుటుంబానికి అండంగా ఉంటామని మార్కెఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం యానంబైల్ పంచాయతీ హరిజనవాడలోని విష్ణు నివాసాన్ని కొత్వాల శ్రీనివాసరావు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం యానంబైల్ గ్రామంలో మృతి చెందిన రైతు బొశెట్టి ముత్తయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# అభివృద్ధికి ఆమడదూరంలోనే..

- కనీస సౌకర్యాలకు నోచుకోని ఆదివాసీలు
- విద్యుత్, రహదారులే కాక తాగునీటి సౌకర్యం లేక అవస్థలు
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



వాగు నుంచి చెలిమల నీరు తెచ్చుకుంటున్న చిరుతానిపాడు వాసులు (ఫైల్)

పాల్వంచరూరల్: సమాజం అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నా ఆదివాసీ గ్రామాలు మాత్రం అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉండడంతో అక్కడి ప్రజలు దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారు. వీరి అభివృద్ధి కోసం ఐటీడీఏ నెలకొల్పడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నా వారి జీవితాల్లో వెలుగులు నిండడం లేదు. ప్రధానంగా విద్యుత్, తాగునీరు, రహదారి సౌకర్యం లేకపోగా.. బోర్లు వేసేందుకు అటవీ శాఖ అభ్యంతరాలు వెల్లువెత్తుతుండడంతో నేటికీ మైళ్ల కొద్ది నడిచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల వెతలపై కథనం.

**అడవే అమ్మ..**

ఆదివాసీ గిరిజనుల ఆచారాలు, కట్టుబాట్లు మిగతా వారితో పోలిస్తే ప్రత్యేకంగా ఉంటాయి. సాధారణ ప్రజలకు దూరంగా అడవిలో జీవించే వీరికి తొలినాళ్లలో వేట జీవనాధారం కాగా.. ఇప్పుడు పోడు సాగు చేస్తున్నారు. ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి జనజీవనానికి దూరంగా ఆదివాసీలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, అడవినే నమ్ముకుని జంతువుల మధ్య జీవిస్తున్న వీరి నివాసాలకు రహదారులు, విద్యుత్ మాటేమో కానీ, తాగేందుకు గుక్కెడు నీళ్లు సరఫరా చేయలేకపోతున్నారు. కాగా, జిల్లాలో 74 ఆదివాసీ గూడేలు ఉన్నట్లు అంచనా. చిన్నాపెద్దా తేడా లేకుండా ఉదయమే అడవిలోకి వెళ్లి సీజన్ల వారీగా తునికాకు, ఇప్పపూవు ఇతర ఫలసాయాన్ని సేకరించి వారాంతపు సంతలు, జీసీసీ డిపోల్లో అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.

**ఏ సౌకర్యమూ లేక..**

ఆదివాసీ గూడేల్లో కానీ, సమీప ప్రాంతాలకు వెళ్లేందుకు కానీ రహదారి లేక పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ఇక వర్షాకాలం వస్తే రహదారులన్నీ బురదమయమై అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది. ఇక విద్యుత్ సౌకర్యం కోసం ఐటీడీఏ ద్వారా సోలార్ లైట్లు ఏర్పాటు చేసినా చాలాచోట్ల ఇప్పుడు అవి పని చేయడం లేదు. అలాగే, మిషన్ భగీరథ నీటిని గిరిజన గూడేలకూ సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించినా కొన్నిచోట్లకే పరిమితమైంది. దీంతో ఆదివాసీలు మైళ్ల కొద్ది నడిచి చెలిమల వద్ద నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది.



విద్యుత్ సౌకర్యం లేని రాళ్లచెలక ఆదివాసీగూడెం

**ఆదివాసీలను పట్టించుకోవడం లేదు**



ఆదివాసీలను దశాబ్దాలుగా పాలకులు పట్టించుకోవడం లేదు. భూబదలాయింపు చట్టం, పీసా, 1/70 చట్టాలు నేటికీ అమలు కావడం లేదు. అడవిలో జీవనం సాగించే ఆదివాసీలకు తాగునీరు, రహదారి, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నాం.

– సోయం సత్యనారాయణ, ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్

**ఉద్యోగ, ఉపాధికి దూరం..**



ఏజెన్సీలో ఆదివాసీలకు ప్రభుత్వ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కడం లేదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ సరిపడా సీట్లు లభించక ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లలేక చదువుకు దూరమవుతున్నారు. ఆపై అర్హతలు ఉన్నా ధృవీకరణ పత్రాలు, ఉద్యోగాలు దక్కక నష్టపోతున్నారు.

– సోయం కన్నారాజు, జాతీయ ఆదివాసీ తెగల సమన్వయకర్త

## ప్రజలతో ఎమ్మెల్యే ముఖాముఖి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించి పాలకవర్గం ఏర్పాటు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాల్వంచ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. పట్టణ, వార్డుల్లో రక్షిత మంచినీరు, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల సమస్యలకు పరిష్కారం చూపించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు తీసుకుని, వాటి పరిష్కారంపై చర్చించారు. వెంటనే అధికారులకు అందించి సాధ్యమైనంత త్వరగా వినతులకు పరిష్కారం చూపాలని, మేజర్ సమస్యలను తనతో మళ్లీ చర్చించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాకూ నాయక్, ఎస్‌కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, నూకల రంగారావు, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

## జీపీ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: టేకులపల్లి మండలం ప్రెగళ్లపాడు గ్రామ పంచాయతీలో రూ.20 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి కాంపెల్లి మంగతార, ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, డీఈ రామకృష్ణ, ఏఈ నవీన్, కార్యదర్శి సతీష్, ఎస్ఐ పోగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరణ



సురేష్

పాల్వంచరూరల్: పాల్వంచ రూరల్ ఎస్ఐగా ఏడు నెలలుగా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్‌ను ఆకస్మికంగా ఎస్పీకి ఎటాచ్ చేశారు. వ్యక్తిగత కారణాలతో బదిలీ చేసినట్లు సమాచారం. అశ్వాపురం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బి.సురేష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు.

**ఎస్ఐగా సుమన్...**



సుమన్

పాల్వంచ: పాల్వంచ పట్టణ ఎస్ఐగా కె.సుమన్ నియామకమయ్యారు. గురువారం ఎస్పీ రోహిత్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ బి.రాము ఇటీవల ఓ హైకోర్టు అడ్వకేట్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. దీంతో సుమన్ ఇక్కడికి బదిలీపై రానున్నారు.

## దుష్ప్రచారం సరికాదు

పాల్వంచరూరల్: ఫంక్షన్ హాళ్ల అద్దె చెల్లించడం లేదని దుష్ప్రచారం చేయడం సరికాదని ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు హరీష్ ఖండించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడుతూ.. పెద్దమ్మగుడికి చెందిన ఏసీ ఫంక్షన్ హాల్‌ను వేలంలో సంవత్సరానికి రూ.40.04 లక్షల అద్దెకు తీసుకుని, ఆరు నెలల అద్దె ముందే చెల్లించినట్లు పేర్కొన్నారు. తరువాత సమస్యలను ఈఓ దృష్టికి తీసుకెళ్తే అద్దె చెల్లించడం లేదని నాపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు.

## న్యాయవాదులకు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఇల్లెందు: ఇల్లెందు కోర్టులో న్యాయవాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. జనగామలో న్యాయవాదు దంపతుల పట్ల పోలీసుల దరుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు. ఇల్లెందు కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ... అక్కడి న్యాయవాదులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ బార్ అసోసియేషన్ పిలుపులో భాగంగా రెండురోజుల పాటు ఆందోళనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఓ కేసు విషయమై పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులను అక్కడి పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తెలిపారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో న్యాయవాదులు బార్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఎస్.మల్లికార్జున్‌రావు, మేకల దుర్గయ్య, దంతాల ఆనంద్, సుడిగాలి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన

జూలూరుపాడు: డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలు, కొత్త నేర చట్టాలపై కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ విద్యార్థులకు అగాహన కల్పించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జూలూరుపాడు పోలీసుల ఆధ్వర్యంలో నూతన నేర చట్టాలు, మాదకద్రవ్యాలు, మహిళల భద్రత, సీసీ టీవీ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

## ఉద్యమకారులకు పెన్షన్ అందించండి..



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: 1969 తొలి, మలి తెలంగాణ ఉద్యమకారులకు ఏ గ్రేడ్ కింద పెన్షన్ అందజేయాలని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు వి.శాంతారాం డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రప్రథమంగా 1969 ఆగస్టు 5న పోలీసు కాల్పుల్లో మరణించిన దస్తగిరి, రాంచందర్ కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాను ఇవ్వాలన్నారు. ఉద్యకారులకు వైద్య, రవాణా సదుపాయాలు కల్పించాలని, వయో పరిమితి లేకుండా ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 250 గజాల ఇంటి స్థలం కేటాయించి నిర్మాణానికి రూ.10 లక్షలు అందజేయాలని కోరారు.

## మెనూ అమలు చేయాలి

సుజాతనగర్: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సర్వారం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

## ఎంపీటీసీల సేవలు మరువలేనివి



ఎంపీటీసీలతో ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: ఎంపీటీసీలు ఐదేళ్లపాటు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అందించిన సేవలు మరువలేనివని, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ ఎంపీపీ బానోతు మౌనిక శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పదవీకాలం పూర్తి చేస్తున్న ఎంపీటీసీలకు ఎమ్మెల్యేతో పాటు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరావు, తహసీల్దార్ నాగభవాని, ఎంపీఓ గణేష్ గాంధీ, సురేందర్, మాజీ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పాఠశాలలకు భవనాలు మంజూరు చేయండి

జూలూరుపాడు: రేగళ్లతండా, వెనకతండా, మాచినేనిపేట తండా ప్రాథమిక పాఠశాలలు శిథిల భవనాల్లో కొనసాగుతున్నాయని, నూతన భవనాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌కు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిథిల భవనాల్లో తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గణేష్, బాలాజీ, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి



మొక్క నాటుతున్న కొత్వాల, తదితరులు

పాల్వంచరూరల్: మండలంలోని దంతలబోరు, గంగదేవిగుప్పా గ్రామాల్లో జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు గ్రామంలోని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, దోమల నివారణకు గంబూషియా చేపలను వదిలారు. మాట్లాడుతూ... వానాకాలం సీజన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించిందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగన్నాథపురం పీహెచ్‌సీ డాక్టర్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ పొలగాని కృష్ణయ్య, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తెల్లం అలివేలు, కొండం వెంకన్న, పాపారావు, వెంకటాచారి, శ్రీనివాసరావు, తెల్లం మల్లేష్, ఏఎన్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు ఆదివాసీల కల..

టేకులపల్లి: పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడెం జిల్లాను నిర్వీర్యం చేసేందుకు మైదాన ప్రాంతానికి నీళ్లు తరలించి ఏజెన్సీ ఆదివాసీలను ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మోసం చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం ముత్యాలంపాడులో మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు ఆదివాసీల గిరిజనుల కలని భద్రాద్రి కొత్తగూడెంలోని ఆదివాసులను మూడు పంటలు పండించుకునే విధంగా సస్యశ్యామలం చేస్తామని చెప్పిన నాయకుల నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. అభివృద్ధి అంటే వారి దృష్టిలో ఉన్నతవర్గాలకు మాత్రమేనని నిరూపించారన్నారు. పోడు కొట్టుకొని వర్షాధారం మీదనే సాగు చేస్తున్న భూములకు చుక్కనీరు ఇవ్వకుండా.. మైదాన ప్రాంతాలకు తరలిస్తుండటం దారుణం అన్నారు. సీతారామ ప్రాజెక్టుతో రోళ్లపాడు, బయ్యారం చెరువులని రిజర్వాయర్‌గా మారిస్తే ఏజెన్సీ మొత్తం మూడు పంటలతో సస్యశ్యామలంగా అవుతుందని చెప్పినప్పటికీ పట్టించుకోకుండా వారి సొంత స్వలాభం కోసం ఏజెన్సీ ప్రజల్ని మోసం చేయడం సరైంది కాదని విమర్శించారు.

## పండ్ల మొక్కలకు ప్రాధాన్యమివ్వండి..



మొక్క నాటుతున్న అధికారులు

ఇల్లెందురూరల్: ప్లాంటేషన్లలో చావు మొక్కల స్థానంలో కొత్తవాటిని నాటాల్సి వస్తే పండ్ల మొక్కలకు ప్రాధాన్యమివ్వాలని సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ కృష్ణగౌడ్ సూచించారు. మండలంలోని వేపలగడ్డ ప్లాంటేషన్‌ను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంటేషన్ మొత్తం కలియ తిరిగి కోతులను తిరిగి అడవులలోకి రప్పించేందుకు నూతన ప్లాంటేషన్‌లలో పండ్ల మొక్కలు కూడా నాటేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. తక్కువ సమయంలో ఎదిగే పండ్ల మొక్కలైతే సత్వర ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌లలో పలు మొక్కలను నాటారు. అనంతరం అటవీశాఖ కలపయార్డ్‌లో కలప వేలంపాటను పరిశీలించారు. ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, ఎఫ్ఆర్ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

**జీవ వైవిధ్యానికి మొక్కలు నాటాలి..**

జూలూరుపాడు: జీవ వైవిధ్యానికి ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లై అధికారి రుక్మిణిదేవి, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దాన్ ఫౌండేషన్ – ఐటీసీ ఎంఎస్కే భద్రాచలం సంయుక్త ఆధ్వర్యంలో మాచినేనిపేట గ్రామ పంచాయతీలో గోపాతండా చెరువు కట్టపైన, పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తోట తులసీరామ్, కార్యదర్శి లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

**మున్సిపల్ వార్డులలో..**

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మున్సిపాలిటీలోని పలు వార్డులలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించారు. రామవరంలోని 8వ వార్డులో కౌన్సిలర్ కంచర్ల జమలయ్య ఆధ్వర్యంలో పంజాబ్‌గడ్డలో భారీ వర్షాలకు జామ్ అయిన డ్రైన్లను తనతో పాటు మున్సిపల్ వర్కర్లతో సిల్ట్ తొలగించారు. 16 వార్డులో కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, అనారోగ్యానికి గురి కాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై కరపత్రాలు పంచడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు.

## నేచర్ పార్క్‌లో విద్యార్థుల శ్రమదానం




పార్క్ వద్ద డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లోని అటవీశాఖ నేచర్ పార్క్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం శ్రమదానం చేశారు. ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలను తొలగించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్, గోనె సంచులను వినియోగించాలన్నారు. ఆ దిశగా విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించి మార్పుకు కృషి చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సింగభూపాలెం చెరువుకు జలకళ



పూర్తిస్థాయిలో నిండిన చెరువు

సుజాతనగర్: వరుసగా కురుస్తున్న వానలతో ఊరూరా జలకళ ఉట్టిపడుతోంది. జిల్లాలోని పెద్దచెరువుల్లో ఒకటైన సింగభూపాలెం చెరువు ప్రస్తుతం నిండుకుండను తలపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి 400 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కుడి కాల్వ వద్ద 16 అడుగుల నీటి మట్టం ఉంది. ఎడమ కాల్వ నీటి సామర్థ్యం 20 అడుగులు కాగా 19 అడుగులక చేరింది. మరో అడుగు మేర నీరు చేరితే అలుగు పడుతుంది. కాగా చెరువు ఎడమ, కుడి కాల్వల్లో సిల్ట్, పిచ్చిమొక్కలు పెరిగిపోవడం వలన నారుమడులకు నీళ్లందడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులంతా నార్లు పోసుకొని దమ్ములు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇరిగేషన్ అధికారులను అడిగితే సిల్ట్ తొలగించేందుకు డబ్బులు లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాల్వల్లో సిల్ట్ తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వం హామీలు అమలు చేయాలి




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడు కె.రంగయ్య, సహాయ కార్యదర్శి నాని రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలకు రూ.10 లక్షలు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర హామీలను అమలు చేయాలన్నారు. ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని, దీనికి నిబంధనలను సడలించాలన్నారు. పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలని, ధరణి సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ప్రకటించిన రూ.12వేల జీవన భృతి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ గన్యాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, అమర్లపూడి రాము, మాచర్ల సత్యం, నూపా భాస్కర్, కె.కల్పన, బి.ధర్మ, గోపాలరావు, యాకూబ్‌షావలీ, మధుసూదన్‌రెడ్డి, నిమ్మల రాంబాబు, శంకర్, వెంకన్న, కిషోర్, పి.సతీష్, పృథ్వీ, అజయ్, సావిత్రి, సరోజ, రాంచందర్, మల్ల వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.